క్లుప్తంగా

బియ్యం సంచులకు నిప్పు



బొగ్గులుగా మారిన బియ్యాన్ని చూపుతున్న బాధితులు

బత్తలపల్లి: బియ్యం సంచులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన గుమ్మల్లకుంట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్ నల్లబోయనపల్లి నారాయణస్వామి, ఆదెమ్మ దంపతులు ఓ రైతు నుంచి రూ.5,500తో రెండు బస్తాల బియ్యం ప్యాకెట్లు తీసుకున్నారు. వాటిని ఇంటి ముందు ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు బియ్యం సంచులకు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. ఆదెమ్మ గమనించి నీటితో మంటలను ఆర్పివేసింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి పరామర్శించారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గాండ్లపెంట: మలమీదపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొడవలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సూచించారు. పత్యాపురం, పత్యాపురం ఎగువ తండా, దిగువ తండాల్లో గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామస్తులతో సభ నిర్వహించారు. చిన్న చిన్న సంఘటనలకు గొడవలకు దిగే వారిపైన కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు పాల్గొన్నారు.

ఆప్కాస్‌లో చేర్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్(ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఆఫ్ ఔట్‌సోర్సింగ్)లో చేర్చాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

నేడు మండల సమావేశం

బత్తలపల్లి: ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివ నాగప్రసాద్ తెలిపారు.


ముంగిటకే వైద్య సేవలు

తాడిమర్రి: మారుమూల గ్రామాల్లో ప్రజల ముంగిటకే ప్రభుత్వం వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వైద్యాధికారి గోవర్దన్ నాయుడు అన్నారు. గురువారం ఆయన నాయనపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. మంచం పట్టిన రోగులకు వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సాయికీర్తన పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయండి

కదిరి అర్బన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన కౌలేపల్లి ఎస్సీకాలనీలో మండల కన్వీనర్ ప్రకాష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఫయాజ్, కో ఆప్షన్ అల్లాభక్ష్ పాల్గొన్నారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ




ఎస్‌ఐలు దిలీప్‌కుమార్, ధరణిబాబు

తలుపుల/తనకల్లు: తలుపుల నూతన ఎస్‌ఐగా నియమితులైన జి.దిలీప్ కుమార్, తనకల్లు నూతన ఎస్‌ఐగా నియమితులైన ధరణిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐలు తెలిపారు.

నేడు రథసప్తమి ఉత్సవం

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు రథసప్తమి సందర్భంగా స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం ఇస్తారని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

- పేదల కోసం 124 సార్లు జగనన్న బటన్ నొక్కి సాయం అందించారు
- వచ్చే ఎన్నికల్లో రెండు బటన్‌లు నొక్కి మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం
- పొదుపు మహిళలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపు
- వైఎస్సార్ ఆసరా 4వ విడతగా రూ.10.79 కోట్ల చెక్ విడుదల




వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన మెగా చెక్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హాజరైన మహిళలు

ధర్మవరం: డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ముదిగుబ్బ మండలానికి సంబంధించి 1373 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత కింద రూ.10,79,32,145 మెగా చెక్‌ను గురువారం ముదిగుబ్బ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విడుదల చేశారు. అనంతరం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పొదుపు మహిళలు స్వయం ఉపాధితో చేస్తున్న చిరు వ్యాపారుల స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణమాఫీ హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ఫలితంగా పొదుపు సంఘాల మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగనన్న ఒక్కో సంఘానికి రూ.10 నుంచి రూ.15లక్షల దాకా రుణాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు రుణాలు మాఫీ చేశారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా ముదిగుబ్బ మండలంలో మహిళా సంఘాలకు రూ.42.32కోట్లు, సున్నా వడ్డీ ద్వారా 1.30 కోట్లు అందజేశారన్నారు. జగనన్న ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారన్నారు. నవరత్నాల పథకాలు ప్రవేశ పెట్టి 124 సార్లు బటన్‌లు నొక్కి సాయం అందించారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే రూ.3,200 కోట్ల నిధులు డీబీటీ ద్వారా పేదల ఖాతాలలో జమ చేశారన్నారు. పేదలందరూ రానున్న ఎన్నికల్లో రెండు బటన్‌లు నొక్కి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పొరపాటున బాబుకు అవకాశం ఇచ్చారంటే పథకాలు నిలిపివేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో అనేక కుట్రలు, పొత్తులతో జిత్తులమారిగా చంద్రబాబు మారుతారని, పేదలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి, నాయకులు భాస్కర్, చంద్రాయుడు, సేవే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయండి

- కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్‌అహ్మద్



ఎన్‌పీకుంట: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్



గాండ్లపెంట: హాజరైన ప్రజాప్రతనిధులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఎన్‌పీకుంట/తలుపుల/గాండ్లపెంట/నల్లచెరువు/తనకల్లు: సార్వత్రిక ఎన్నికలకు రాయలసీమ ప్రాంతంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించనున్న 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీ.ఎస్.మక్బూల్ అహమ్మద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఎన్‌పీకుంట, తలుపుల, గాండ్లపెంట, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో పర్యటించారు. ఎన్‌పీకుంటలో ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఈసీ సభ్యుడు పూలశ్రీనివాసులురెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు బత్తల వెంటకరమణ, జిల్లా అధికార ప్రతినిధి వేములఫయాజ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలక్రిష్ణనాయుడు, రామచంద్రారెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, షామీర్‌బాషా, జిల్లా అధికార ప్రతినిధి వేములఫయాజ్ పాల్గొన్నారు. మక్బూల్ అహమ్మద్ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల సమయంలో, పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేసేందుకు సిద్ధం సభను నిర్వహిస్తున్నారన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు రామాంజులురెడ్డి, నాగమునీశ్వరనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు ఓబుళరెడ్డి, కృష్ణారెడ్డి, గ్రామకన్వీనర్లు అస్లం, వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి, ఉపసర్పంచులు నబీసాబ్, సామిరెడ్డి, బీసీసెల్ కన్వీనర్ ఆదెప్పనాయుడు, మాజీ మండల కన్వీనర్ బాబాఫక్రుద్దీన్, మాజీ ఎంపీపీ సామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తలుపుల మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో మండల కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయగా మక్బూల్‌అహ్మద్ హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధం సభకు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీనియర్‌నాయకులు కుర్లిశివారెడ్డి, సేవాదల్ జోనల్ ఇన్‌ఛార్జ్ డీ.కే. బాబు తదితరులు పాల్గొన్నారు. గాండ్లపెంటలో నిర్వహించిన సమావేశంలో సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ హాజరై మాట్లాడారు. 'సిద్ధం' సభకు మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్‌లు, అభిమానులు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్లచెరువు మండల కేంద్రంలోని గీతామందిరంలో జరిగిన సమావేశంలో సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ మాట్లాడారు. మండలం నుంచి భారీగా సిద్ధం సభకు తరలిరావాలని కోరారు. బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు. మండల కన్వీనర్ బట్టీ హైదర్‌వలి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు. తనకల్లులోని కొక్కంటిక్రాస్‌లో ఉన్న పోలం సిద్దారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మక్బూల్ అహమ్మద్ మాట్లాడారు. సిద్ధం సభ కోసం మండలం నుంచి 30 బస్సులు ఏర్పాటు చేశామని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే



టిడ్కో సముదాయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ధర్మవరం పట్టణంలో ప్రభుత్వం పేదలకు ఉచితంగా నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం పరిశీలించారు. టిడ్కో డీఈ సాలన్నను అడిగి పనులకు సంబంధించిన పురోగతిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 1440మంది పేదలకు ఈ సముదాయంలో అన్ని సౌకర్యాలతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, త్వరలోనే గృహప్రవేశ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సముదాయాలలో సీసీరోడ్లు, విద్యుత్, నీటి సరఫరాకు సంబంధించి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, సరితాల బాషా, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, చాంద్‌బాషా, మేడాపురం వెంకటేశ్ పాల్గొన్నారు.

సేవావజ్ర పురస్కారం అందజేత



కలెక్టర్ నుంచి సేవావజ్ర పురస్కారాన్ని అందుకుంటున్న కె.మోహన్ నాయక్

ఓడీచెరువు: కొండకమర్ల సచివాలయం-2 పరిధిలో గ్రామ వలంటీర్ కె.మోహన్ నాయక్ అందించిన ఉత్తమ సేవలకు సేవావజ్ర పురస్కారం దక్కింది. కలెక్టర్ అరుణ్ బాబు చేతులమీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. సేవారత్నకు ఎస్.రెడ్డి శేఖర్ ఓడీచెరువు-2, ఇ.రాధ కొండకమర్ల-2, కె.పుష్పలత అల్లాపల్లి, పి.రఘునాథ్ ఇనగలూరు, ఆర్.సురేంద్ర రెడ్డి వెంకటాపురం ఎంపికైనట్లు ఎంపీడీవో కార్యలయ సూపరిండెంట్ పూల రెడ్డప్ప తెలిపారు.

ఘనంగా సప్త మాతృక దేవి విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల క్రాస్ సమీపాన గురువారం శ్రీ సప్త మాతృక దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై అమ్మవారికి పూజలు చేశారు. సర్పంచ్ వెంకటరమణ, నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఆలయానికి విరాళం

తనకల్లు: టీ.సదుం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయానికి కదిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ రూ. 20 వేలు విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని గురువారం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులతో అలయ కమిటీ సభ్యులకు అందజేయించారు.

జగనన్నకు అండగా నిలవాలి



బడవాండ్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దుద్దుకుంట అపర్ణారెడ్డి



సీ.రెడ్డివారిపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దుద్దుకుంట అపర్ణారెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అపర్ణారెడ్డి

నల్లమాడ: అక్క చెల్లెమ్మల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి అన్నారు. మండలంలోని చారుపల్లి పంచాయతీ పోలంవాండ్లపల్లి, సీ.బడవాండ్లపల్లి, సీ.రెడ్డివారిపల్లి గ్రామాల్లో గురువారం దుద్దుకుంట అపర్ణారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న అన్ని పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయిచారన్నారు. సంక్షేమ పథకాల కొనసాగాలంటే జగనన్న మరోమారు సీఎంగా ఎన్నిక కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నతోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఆమె ప్రజలను కోరారు.

వైఎస్సార్ సీపీలో చేరిక:

సీ.రెడ్డివారిపల్లిలో టీడీపీ నాయకులు చంద్ర, సాంబశివ, శంకర్, వీరనారప్ప, కిరణ్‌కుమార్, రామచంద్ర, లక్ష్మీదేవి వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. అపర్ణారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీ.ప్రమీలమ్మ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పమాంబ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఎంసీ బయపరెడ్డి, సాతర్ల రామచంద్ర, నాయకులు అశ్వర్థనారాయణ, డీలర్లు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

నల్లమాడ: కొండకింద తండా, వేళ్లమద్ది, కొత్తపల్లి తండా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు, అప్పరాచెరువు, గంటాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శివశంకర్‌నాయక్ గురువారం పరిశీలించారు. విద్యుత్, గాలి, వెలుతురు, దివ్యాంగులు కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపులు తదితర సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఉండాలని ఆయన వీఆర్‌ఓలకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

రామగిరి: పేరూరులో గురువారం సుబ్రహ్మణ్యేశ్వరషష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుబ్బరామప్ప సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఉదయం నుంచి ప్రత్యేకహోమాలు, పూజలు అనంతరం ఆలయం చుట్టూ స్వామి ప్రతిమతో రథంలో ఊరేగించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్ఎల్‌వీ మార్కెట్‌లో సుబ్రహ్మణ్య నాగదేవతల కట్ట వద్ద గురువారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు విజయ్‌కుమార్‌శర్మ నాగదేవతల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, పాలాభిషేకం, షష్టి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దోషరహితంగా ఓటర్ల జాబితా

అమడగూరు: ఓటర్ల జాబితాను దోషరహితంగా తయారు చేయాలని తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇంతవరకు సిద్ధం చేసిన ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించినట్లయితే తప్పనిసరిగా డెత్ సర్టిఫికెట్‌ను జతపర్చాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గడ్డి వామికి నిప్పు

కనగానపల్లి: భానుకోటలో గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధిత రైతు పాపన్న మాట్లాడుతూ రెండున్నర ఎకరాల్లో సాగుచేసిన వరి గడ్డి ఇటీవల నూర్పిడి చేసి ఇంటి సమీపంలో పశుగ్రాసాన్ని వాము వేసినట్లు తెలిపాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారన్నారు. రూ.15 వేలకు పైగా నష్టపోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్జేడీకి సన్మానం



ఆర్జేడీ రాఘువరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుక్కపట్నం డైట్‌కు విచ్చేసిన ఎద్దుల రాఘువరెడ్డికి జిల్లా వైఎస్సార్ టీఎఫ్ ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి గురువారం కలిసి ఘనంగా సన్మానించారు. ఇంద్రప్రసాద్, పుల్లారెడ్డి, రవీంద్రారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ కళాశాలపై చర్యలు తీసుకోండి

కదిరి అర్బన్: పట్టణంలోని విజ్ఞాన్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. డబ్బు చెల్లిస్తే చాలు సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయన్నారు.

'నమస్తే'లో పేర్లు నమోదు చేసుకోండి

కదిరి టౌన్: నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్(నమస్తే) పథకంలో కార్మికులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేశామని, ఆధార్, రేషన్ కార్డు, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న గుర్తింపు కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ వివరాల నకళ్లు సమర్పించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నోడల్ అధికారి రమణ, పర్యావరణ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్య పరీక్షలు

కదిరి టౌన్: కదిరి ఏరియా ఆస్పత్రిలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సవేరా హాస్పిటల్ సహకారంతో పెన్షనర్లకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆత్మారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుసేన్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని బాలికల కళాశాల సమీపంలో గురువారం రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని శివాలయం వీధికి చెందిన టెంకాయల వ్యాపారి వెంకటరమణ గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

'సిద్ధం' సభకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ఓడీచెరువు: సిద్ధం సభకు సన్నద్ధం కావాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాప్తాడులో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిద్ధం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులందరూ తరలిరావాలని కోరారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, కన్వీనర్ రాజు నాయుడు, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, బూత్ లెవల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి, యూత్ కన్వీనర్ హరినాథ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, సర్పంచు జగన్ మోహన్ చౌదరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శివయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

ఓడీచెరువు: ప్రమాదాల్లో గాయపడిన కొండకమర్ల గ్రామానికి చెందిన పలువురిని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి గురువారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు కాలు విరిగిన లక్ష్మినరసమ్మ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివయ్య, మునిస్వామిని పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన గంగన్న, మస్తాన్ వలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.

వైభవంగా అక్కదేవతల విగ్రహ ప్రతిష్టాపన



అక్కదేవతల ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: ముదిగుబ్బ మండలం పెంకుల గేటు సమీపంలోని అక్కదేవతల ఆలయంలో నల్లమాడ మండలం అరవవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు డుంగావత్ రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం అక్కదేవతల విగ్రహ ప్రతిష్టాన ఘనంగా జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. నిర్వాహకులు డుంగావత్ రమేష్‌నాయక్, రాజునాయక్, రవీనాయక్, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్ సీపీ నాయకులు పీవీ భాస్కర్ రెడ్డి, డి.రమణానాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు బైక్ ర్యాలీ

కదిరి టౌన్: శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకొని పట్టణంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బలిజ సంఘం నాయకులు గురువారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ర్యాలీ ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి ప్రారంభం అవుతుందన్నారు. బలిజ సంఘం నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జున

కనగానపల్లి: రాజకీయ, వర్గ విబేధాలతో ఘర్షణలకు పాల్పడి గ్రామాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. గురువారం భానుకోట గ్రామంలో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా గ్రామస్తులంతా ప్రశాంతంగా ఉండాలన్నారు.